క్లుప్తంగా

విరాళం అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన కూనింటి శేఖర్ రెడ్డి దంపతులు మంగళవారం నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహా క్షేత్రం నిర్మాణానికి రూ.5 లక్షలను విరాళంగా అందజేశారు. విరాళాన్ని చెక్కు రూపంలో కమిటీ సభ్యులకు శేఖర్ రెడ్డిఅందజేశారు.

ఆర్థిక సహాయం

వర్ని: తగిలేపల్లి గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ హుస్సేన్ కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు అందజేశారు. హుస్సేన్ కుమార్తె వివాహం త్వరలో జరగనున్నందున తన వంతు సహాయంగా నగదును అందజేశారు. తగిలేపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీహరి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రెడ్డి రాంబాబు, సుద్దులం మాజీ సర్పంచ్ పిర్యా నాయక్, తదితరులున్నారు.

నిధుల మంజూరు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో మహిళా సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ.5 లక్షల నిధులు మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు సట్లపల్లి గణేష్ మంగళవారం తెలిపారు. గ్రామంలో మహిళ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఐకేపీ సీసీ జ్యోతి, చిన్నక్క, రోహిత, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

మోర్తాడ్: కొత్తగా పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు గతంలో రైతు బీమాకు దరఖాస్తు చేసుకుని ఉండకపోతే ఇప్పుడు దరఖాస్తులు అందించాలని ఏర్గట్ల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి 59 ఏళ్ల లోపు వారు రైతు బీమాకు అర్హులు అని చెప్పారు. దరఖాస్తు ఫారంతో కలిపి జిరాక్స్‌లను సంబంధిత ఏఈవోలకు అందించాలని సూచించారు.

కొనసాగుతున్న దీక్షలు

రెంజల్(బోధన్): రెంజల్ శివారు నుంచి ఎడపల్లి మండలం బ్రహ్మణపల్లి గ్రామం వరకు గల బందర్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని రెంజల్ గ్రామ రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 14 రోజులకు చేరుకున్నాయి. కుల సంఘాల వారీగా దీక్షలు చేపడుతున్నారు. మంగళవారం ముదిరాజ్ కుల సంఘం ప్రతినిధులు దీక్షల్లో పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు



రెంజల్(బోధన్): మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో రిలయన్స్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థులకు పోటీలను నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారని వివరించారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

నవీపేట: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సర్పంచ్ బత్తూర్ సాయిలు మంగళవారం ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు గ్రామంలో గుర్తించిన 24 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు.

ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ నియోజకవర్గంలో 18 నుంచి 35 సంవత్సరాలు నిండిన వారికి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ అందించనున్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ దరాఖాస్తులను బీఆర్ఎస్ నాయకులు స్వీకరించారు. మొదట రోజు 1500 మంది లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, తదితరులున్నారు.

అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం

రుద్రూర్: నిండు గర్భిణీని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. పోతంగల్ మండల కేంద్రానికి చెందిన విజయ లక్ష్మిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా సారంగపూర్ వద్ద విజయ లక్ష్మికి పురిటి నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది వాహనంలోనే కాన్పు చేశారు. కవలలకు జన్మనిచ్చింది. అనంతరం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

సబ్ సెంటర్లకు సొంత భవనాలు

- మారంపల్లి, నూత్‌పల్లి, గాదేపల్లిలలో నిర్మాణం
- ఒక్కోదానికి రూ.20లక్షలు మంజూరు



గాదేపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న హెల్త్ సబ్ సెంటర్

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న సబ్ సెంటర్లకు అద్దె బాధలు తప్పనున్నాయి. మారంపల్లి, నూత్‌పల్లి, గాదేపల్లి గ్రామాల్లో త్వరలో సొంత భవనాలను నిర్మించనున్నారు. ఈ మేరకు ఒక్కోదానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఖర్చు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండల పీహెచ్‌సీ పరిధిలో మొత్తం ఆరు ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. అవి దత్తాపూర్, నికాల్‌పూర్, డొంకేశ్వర్, మారంపల్లి, నూత్‌పల్లి, గాదేపల్లి గ్రామాల్లో ఉన్నాయి. ఐతే, దత్తాపూర్, నికాల్‌పూర్ సబ్ సెంటర్లకు సొంత భవనాలున్నాయి. మిగతా సబ్ సెంటర్లకు సొంత భవనాలు లేకపోవడంతో కొన్నేళ్లుగా అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. అద్దె డబ్బులు సక్రమంగా రాకపోవడంతో పాటు అద్దె భవనాల్లో సరైన వసతుల్లేక వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మారంపల్లి, నూత్‌పల్లి, గాదేపల్లిలో సొంత భవనాలు నిర్మించనుండగా, స్థలాల ఎంపిక కూడా పూర్తయింది. భవనాలను నిర్మించే బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులకు అప్పగించారు.

త్వరలో టెండర్లు పిలిచి పను లు ప్రారంభించనున్నారు. అయితే, డొంకేశ్వర్‌లో ఉన్న సబ్ సెంటర్ జీపీ భవనంలో కొనసాగుతోంది. దీనికి కూడా సొంత భవనం నిర్మించాల్సి ఉండగా, కలెక్టర్ ఉత్తర్వుల్లో పేరు లేదు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రజలకు సౌకర్యవంతమైన భవనంలో వైద్య సేవలు అందించడానికి సొంత భవనాలను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించడం హర్షణీయం. మారంపల్లితో పాటు డొంకేశ్వర్ మండలంలో మరో రెండు గ్రామాల హెల్త్ సబ్ సెంటర్లకు పక్కా భవనాలను నిర్మించడానికి కృషి చేసిన మంత్రి హరీశ్ రావు, స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. – అర్గుల రవి, ఉప సర్పంచ్, మారంపల్లి

జనాభా నియంత్రణపై అవగాహన

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. జనాభా నియంత్రణ గురించి వారు అవగాహన కల్పించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి స్థానికులకు విపులంగా చెప్పారు. – సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్ హౌసింగ్ బోర్డు కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న పట్టణ పీహెచ్‌సీ సిబ్బంది



కోటగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మున్సిపల్‌లో రూ.15.21 కోట్ల పనులకు ఆమోదం

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ పరిధిలో రూ. 15.21 కోట్ల విలువైన పనుల పునఃప్రతిపాదనలకు ఆమోదం లభించింది. రూ. 2 కోట్లతో శక్కర్ నగర్ కాలనీలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, రూ. 25 లక్షలతో పట్టణ శివారులోని అంబం గేట్ వద్ద స్వాగత తోరణ నిర్మాణం, రూ.3.68 కోట్లతో పట్టణంలో బీటీ రోడ్ల నిర్మాణం, రూ.3.95 కోట్లతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మూడు సీసీ రోడ్ల నిర్మాణం, రూ. 3.83 కోట్లతో సీసీ డ్రైన్‌ల నిర్మాణం, రూ.75 లక్షలతో 12 వార్డులోని చమ్‌డా గల్లీలో స్ట్రోమ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, రూ.50 లక్షలతో పట్టణంలోని ప్రధాన రహదారిపై బస్‌బేస్, బస్ షెల్టర్ల నిర్మాణం, రూ. 25 లక్షలతో ఆచన్‌పల్లి కమాన్ వద్ద స్వాగత తోరణ నిర్మాణంతో పాటు పట్టణంలోని 25 వార్డు రాకాసీపేట్ కాలనీలో, 34 వార్డులో కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నారు.

మేధావులపై పెట్టిన కేసులను ఎత్తేయాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

మాక్లూర్: మేధావులు, ప్రజాస్వామ్యవాదులపై ప్రభుత్వం అక్రమంగా పెట్టిన ఉపా కేసులను వెంటనే ఎత్తేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నిజామాబాద్ డివిజన్ కమిటీ సభ్యుడు డి.గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం మాణిక్‌భండార్ వద్ద ఉపా చట్టాన్ని రద్దు చేయాలి అనే వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పౌరహక్కుల నేతలతో పాటు మేధావులు, రచయితలు, జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులపై ఉపా కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను నొక్కడానికే ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. నాయకులు సతీష్, శివరాజ్, నవీన్, గబ్బర్‌సింగ్‌లు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



బోధన్‌లో బోనాలతో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి



అంబం(ఆర్)లో ..



భవానిపేట్‌లో ..

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో పలు చోట్ల మంగళవారం బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. బోధన్ పట్టణంలో మేరు సంఘం, ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. ముఖ్య అతిగా మున్సిపల్ చైర్మన్ తూము పద్మాశరత్ రెడ్డి హాజరయ్యారు. రుద్రూర్ మండల అంబం(ఆర్), పోతంగల్ మండల కేంద్రంలో, కోటగిరి మండలం కొత్తపల్లిలో, మోస్రా మండల కేంద్రంలో, బోధన్ మండలం భవానీపేట్ గ్రామంలో పండుగ చేశారు.

బట్టాపూర్ తండాలో తీజ్ పండుగ



మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్‌లో తీజ్ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన ఆడబిడ్డలు సాంప్రదాయ దుస్తులు ధరించి చేతులకు గోరింటాకు పెట్టుకుని బోనాలను సమర్పించారు. కోరిన కోరికలను నెరవేర్చాలని వేడుకున్నారు. ప్రతి ఆషాడమాసంలో తీజ్ పండుగను నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది.

పారిశుధ్య పనుల అడ్డగింత

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని వారాంతపు సంతలో ప్రయివేటు వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయిస్తున్న ఎడపల్లి ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఎంపీటీసీ షేక్ జావిద్ బాబాలను ఎడపల్లి మండల గ్రామపంచాయతీ కార్మికులు సీపీఎం, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. నాయకులు మాట్లాడుతూ...కార్మికులకు ప్రభుత్వం వేతనం ఇస్తున్నట్లు ప్రకటించి నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ..కార్మికులు సమ్మెలో ఉన్నందున గ్రామ ప్రజలు సహకరించి చెత్త చెదారాన్ని బయట పడేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నాయకులు జంగం గంగాధర్, మల్లేష్, గంగాధర్, పోశెట్టి తదితరులున్నారు.

నవీపేటలో ర్యాలీ

నవీపేట: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేపడుతున్న సమ్మెలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడీ శ్రీనివాస్, లక్క గంగాధర్ పాల్గొన్నారు.

చందూర్‌లో కుల సంఘాల సమావేశం

రుద్రూర్: చందూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కుల సంఘాల బాధ్యులు, గ్రామ పెద్దల సమావేశాన్ని మంగళవారం సర్పంచ్ సాయరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మి దేవికి శుక్రవారం బోనాలు సమర్పించాలని, ఆదివారం గ్రామ దేవతల పండగ జరపాలని తీర్మానించారు.

'మా పట్ల వివక్ష చూపుతున్నారు'



మోర్తాడ్ ఎక్సైజ్ సీఐతో తమ గోడు వెళ్లబోసుకుంటున్న చౌట్‌పల్లి గీత కార్మికులు

మోర్తాడ్: కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి గీత పారిశ్రామిక సహకార సంఘంలో ఒక వర్గం వారు తమ పట్ల వివక్ష చూపుతున్నారని గీత కార్మికులు మోర్తాడ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుండప్పతో మంగళవారం తమ గోడు వెళ్లబోసుకున్నారు. గౌడ కులస్తులం కాకపోయినా మా కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడ్డాయని కార్మికులు తెలిపారు. మాలో ఎవరైనా చనిపోతే కుటుంబ సభ్యులకు చెట్లు గీయడానికి అవకాశం ఇవ్వడం లేదని, ఇలా అయితే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. గీత పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం ఉన్నా మా వారసులకు వర్తింప జేయకుండా గౌడ కులస్తులు కట్టడి చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఇంజనీర్స్ డే వేడుకలు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద మంగళవారం తెలంగాణ ఇంజనీర్స్ వేడుకలను ప్రాజెక్ట్ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ తొలి చీఫ్ ఇంజినీర్ నవాబ్ అలీ జంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంజినీర్ల కృషిని ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ కొనియాడారు. డిప్యూటీ ఈఈలు గణేష్, శంకర్, గంగభూషణ్, రఘుపతి, ఏఈఈలు అక్తర్, మాణిక్యం, సారిక తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

ఎడపల్లి(బోధన్): మండలంలో సోమవారం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని ఠాణాకలాన్ గ్రామంలో గౌతమ్ అనే వ్యక్తి ఇల్లు కూలిపోయింది. నిరుపేద కుటుంబమైన గౌతం కుటుంబ సభ్యులు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయండి



వినతి పత్రం అందజేస్తున్న శివసేన నేతలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ ప్రజలకు శుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని శివసేన పార్టీ పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడారు. బల్దియా సరఫరా చేసే తాగు నీరు ఆకుపచ్చ కలర్‌లో వస్తున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి శుభ్రమైన నీటిని అందిస్తున్నా బల్దియా అధికారులు మాత్రం కలుషితమైన నీటిని అందించడం సరికాదన్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్‌లోని ఫిల్టర్ బెడ్‌ను శుద్ధి చేసి పట్టణ ప్రజలకు శుభ్రమైన తాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. నేతలు గౌతం, రవికిరణ్, భూమయ్య, నర్సింలు, ప్రీతం, విజయ్, రాజు తదితరులున్నారు.


సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు



రెంజల్‌లో భిక్షాటన చేస్తున్న ఎండీఎం కార్మికులు

సాక్షి నెట్‌వర్క్ : పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు పెంచిన గౌరవ వేతనాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు సమ్మె చేస్తున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీల కార్మికులు సమ్మె నిర్వహించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు తాము ఆందోళనలు విరమించబోమని కార్మికులు స్పష్టం చేశారు. వీరి సమ్మెకు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ..పెరిగిన నిత్యావసర సరుకుల వల్ల వంట చేయడానికి ఆర్థికంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వంట గ్యాస్, కోడి గుడ్లు ప్రభుత్వమే సరాఫరా చేయాలని డిమాండ్ చేశారు. కోటగిరి, మోర్తాడ్, రెంజల్ మండల కేంద్రాలతో పాటు బోధన్, ఆర్మూర్ పట్టణాలలో సమ్మె కొనసాగింది.

తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఇన్‌సీడియోస్ – (తెలుగు) – 10.45, 04.20, 10.40
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)- 12.40, 6.40

స్క్రీన్-2 – సామజవరగమన – 10.00, 1.00, 4.00, 07.00, 10.00

స్క్రీన్-3 – రంగబలి – 10.40, 1.35, 07.25, 10.20, 10.20
స్పై(తెలుగు)-4.30

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



వర్నిలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేతలు

వర్ని: జిల్లాలో నేడు(బుధవారం) జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వర్ని మండల పీడీఎస్‌యూ ఏరియా కార్యదర్శి లకావత్ గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దందా కొనసాగుతున్నా ప్రభుత్వం వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు నేటికీ ఇవ్వడం లేదని ఆరోపించారు . సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

బోధన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం పాఠశాలలు, కళాశాలల బంద్‌కు పిలుపు నిచ్చాయి. ఈ మేరకు మంగళవారం పట్టణ కేంద్రంలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు.



బోధన్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

ఆటలపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఆర్మూర్‌టౌన్: విద్యాసంస్థల్లో కచ్చితంగా పీఈటీలను, పీడీలను వెంటనే నియమంచి, ఆటలపై దృష్టి సారించాలని తెలంగాణ నవనిర్మాణ విద్యార్థి సేన(టీఎన్‌వీఎస్) జిల్లా సంయక్త కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మంగళవారం టీఎన్‌వీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరి ప్రధాన కూడళ్ల వద్ద ఆటలు ఆడారు. ఎంఈవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎంఈవో రాజగంగారాంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు కిశోర్, సాయి, ఆరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం





వేల్పూర్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు బాల్కొండలో..

రైతులకు ఉచిత కరెంటు మూడు గంటలు మాత్రమే సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించినట్లు ఆరోపిస్తూ మంగళవారం ఆర్మూర్ పట్టణం, బాల్కొండ, వేల్పూర్ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తక్షణమే ఆయన వ్యాఖ్యలు ఉపసంహరించుకొని రైతులకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

– ఆర్మూర్‌టౌన్/బాల్కొండ/వేల్పూర్

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

బోధన్: రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని కోరుతూ మంగళవారం స్థానిక ఆర్డీవో రాజేశ్వర్‌కు ప్రాథమిక గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘం, కురుమ సంఘం మండల ప్రతినిధులు వినతి పత్రం అందించారు. 20 గొర్రెలు, ఒక పొట్టేలు యూనిట్ కోసం సంఘం సభ్యులు రూ.43 వేల750 డీడీల రూపంలో వాటా ధనం ఐదేళ్ల క్రితం చెల్లించామని పేర్కొన్నారు. ఇప్పటికీ గొర్రెలను అందించలేదన్నారు. త్వరగా గొర్రెల పంపిణీ చేపట్టాలని ఆర్డీవోను కోరారు.ప్రతినిధులు దేవరావు, వీరయ్య, మేడి రవి తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంప్ నిర్వహణలో మార్పులు చేయండి

బోధన్: దివాంగుల వైద్య ధ్రువీకరణ కోసం ఏర్పాటు చేస్తున్న సదరం క్యాంప్ నిర్వహణ తీరు మార్చుకోవాలని వీహెచ్ పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి)మహిళ విభాగం జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ ప్రభుత్వాన్ని కోరారు. బోధన్‌లో మంగళవారం ఆమె మాట్లాడారు. సదరం స్లాట్ బుకింగ్‌కు గంట వ్యవధి మాత్రమే ఇవ్వడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్లాట్ బుకింగ్‌కు ఉదయం 9నుంచి రాత్రి 9 వరకు వ్యవధి ఇవ్వాలని అధికారులను కోరారు.